సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 9 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 27.510 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 90.846 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,451
3శాతం జీఎస్టీతో	రూ.5,615
నవర (8గ్రా)	రూ.44,920

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.7 /27.5

శనివారం గాలిలో తేమ 54 శాతం ఉంది. ఆదివారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. వాతావరణం చల్లగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రూ.1.77 కోట్ల పొగాకు కొనుగోళ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో రైతుల వద్ద అదనపు నిల్వ కొనుగోలులో భాగంగా తిక్కవరం క్లసర్‌కు చెందిన రైతుల పొగాకును శనివారం జరిగిన వేలంలో రూ.1,77,55,000లకు వివిధ కంపెనీల బయ్యర్లు కొనుగోలు చేశారు. మొత్తం 627 బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా, వీటిలో 605 బేళ్లు కొనుగోలు చేశారు. 22 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.245 పలకగా, అత్యల్ప ధర రూ.150 చొప్పున లభించింది. సగటు ధర రూ.231.92గా నమోదైంది.

16న బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి నెల్లూరు జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఈ నెల 16వ తేదీన ఎంపిక చేయనున్నట్లు ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాడ్మింటన్ అండర్-11, 13, 15, 17, 19 పురుషులు, మహిళల జట్లకు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌కు క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 16వ తేదీన ఉదయం 7 గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం వద్ద జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు టి.వరప్రసాద్ మొబైల్ నంబర్ 9866930555, కోచ్ జి.వెంకటేష్ మొబైల్ నంబర్ 9494492717లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయశాఖ ఉద్యోగులు



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి

నెల్లూరు(లీగల్): ఏపీ హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ డి.రమేష్ శనివారం నెల్లూరుకు విచ్చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి కోర్టులో ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలని, పదోన్నతుల అంశం, ఉద్యోగుల సంఘానికి భవన వసతి తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నారాయణరెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, శివకుమార్, గిరి, సురేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జోహార్ వైఎస్సార్







- ఘనంగా దివంగత మహానేత రాజన్న జయంతి
- వాడవాడలా ఆత్మీయ నివాళి

అన్నదాతల ఆత్మబంధువు, తన సంక్షేమ పాలనతో ఆంధ్రుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. 1. నెల్లూరులోని కరెంటాఫీస్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ ఆదాల, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు. 2. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు. 3. పొదలకూరులోని సీహెచ్‌సీలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు.

దామవరంలో భూ బకాసురులు


గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు, తెలుగు తమ్ముళ్ల అక్రమాలు అన్నీఇన్నీ కావు. అయితే జిల్లాలో యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్ మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలపై పనిగట్టుకుని పసలేని విమర్శలు చేస్తుండగా.. అప్పట్లో టీడీపీ నేతలు చేసిన అక్రమాల వల్లే ఆ పార్టీ 2019 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిందని జిల్లా ప్రజలు చెబుతుండడం గమనార్హం. కావలి నియోజకవర్గంలోని దామవరం విమానాశ్రయానికి భూసేకరణలో పచ్చనేతలు సాగించిన దురాగతాల వల్లే విమానాశ్రయం నిర్మాణం నిలిచిపోయిందంటున్నారు.

- విమానాశ్రయానికి భూసేకరణలో భారీగా అక్రమాలు
- రెవెన్యూ రికార్డులనే మార్చేసిన టీడీపీ నేతలు
- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన నాయకులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి నియోజకవర్గంలోని దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి టీడీపీ నేతల అక్రమాలు శాపంగా మారాయి. విమానాశ్రయం నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ సానుకూల ఫలితాలు రావడం లేదు. అప్పట్లో విమానాశ్రయ నిర్మాణంపై ప్రకటన రాగానే ఆ ప్రాంతంలోని భూములపై టీడీపీ నాయకులు రాబందుల్లా వాలిపోయారు. పేదల భూములను స్వాహా చేసే కుట్రలకు అధికారులు వంత పాడలేక వివాదాస్పద భూముల పేరుతో ఫైల్ పక్కన పడేయాల్సిన దుస్థితి వచ్చింది.

పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా..

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ముఖ్యమంత్రి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సీఎం ఆదేశాలతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు అనుకూలంగా, జాతీయ రహదారిని అనుకుని రవాణాకు సౌకర్యంగా ఉండేలా కావలి నియోజకవర్గంలోని దామవరం వద్ద విమానాశ్రయం నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 2,300 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించేలా డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణంతో అనంతరం ఆ స్థానంలోకి వచ్చిన కొణిజేటి రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి దామవరం విమానాశ్రయంపై దృష్టి సారించలేదు. 2009–2014 మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ నత్తనడకన సాగింది.



దామవరం ఎయిర్‌పోర్టు మ్యాప్

టీడీపీ హయాంలో..

2014–2019 మధ్యకాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం దామవరం విమానాశ్రయం అంశాన్ని మరోమారు తెరపైకి వచ్చింది. అధికారం అండతో పచ్చనేతలు విమానాశ్రయం నిర్మించాలనుకున్న ప్రాంతంలోని భూములపై రాబందుల్లా వాలిపోయారు. ప్రధానంగా దామవరంలో ఉన్న ప్రభుత్వ భూములకు నకిలీ రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. దీంతో విమానాశ్రయం కోసం భూసేకరణ అధికారులకు తలనొప్పిగా మారింది. దామవరం ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణ భూములు అంటేనే.. అసలు ఆ భూముల యజమానులు ఎవరో, నకిలీలు ఎవరో అధికారులు తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో 2016లో జిల్లా కలెక్టర్‌గా ఉన్న జానకి దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ సాధ్యం కాదని, అన్నీ వివాదాస్పద భూములే అని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. అనంతరం 2017 మే 18వ తేదీన నెల్లూరుకు వచ్చిన అప్పటి రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో సమావేశమై దామవరంలో విమానాశ్రయం నిర్మాణ ప్రతిపాదనలను రద్దు చేసి, దానిని వేరే జిల్లాకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా ప్రకటించారు. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అధికార టీడీపీ నేతల వైఖరిని తూర్పారబట్టాయి. ప్రజల్లో కూడా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి.

చంద్రబాబు ప్రభుత్వం నడిపిన డ్రామా

1,352 ఎకరాల్లో రూ.398.56 కోట్లతో దామవరంలో విమానాశ్రయం నిర్మించడానికి 2017 సెప్టెంబర్‌లో నిర్మాణ సంస్థకు చంద్రబాబు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు 2018 జూన్ 21న నిర్మాణ సంస్థతో ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకొంది. ఆ అగ్రిమెంట్‌లో నిర్మాణ సంస్థ తన ఆర్థిక వనరులను కనబరచాల్సి ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చినప్పటికీ 2018 డిసెంబర్ 21 నాటికి కూడా నిర్మాణ సంస్థ తన ఆర్థిక వనరులను ప్రభుత్వానికి చూపలేక విఫలమైంది. ఈ విషయం తెలిసి కూడా అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు 2019 జనవరి 11వ తేదీన విమానాశ్రయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం ఎంతగా ఎదురుచూసినా నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాకపోవడంతో అగ్రిమెంట్‌ను ప్రభుత్వం రద్దు చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయ్యాక విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణపై దృష్టి సారించి వివాదాలను పరిష్కరిస్తూ 1,310 ఎకరాలు సేకరించింది. అలాగే కేంద్ర విమానయాన శాఖకు చెందిన 'ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా' దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు మంజూరు చేసింది. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాశ్రయ నిర్మాణ సంస్థ తమ వద్ద నిధులు లేవని.. ఏడాదిన్నర తర్వాత చావు కబురు చల్లగా చెప్పింది. ఈ క్రమంలో నిర్మాణ ప్రక్రియ మొదటికి వచ్చింది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గతంలో ముంబైకి చెందిన విమానాశ్రయ నిర్మాణ సంస్థ ప్రతినిధులను సంప్రదించి వారిని దామవరానికి తీసుకొచ్చి భూములు, విమానాశ్రయ లాభదాయక నిర్వహణ అంశాలను తెలియజేశారు. ఇది ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించి, నిర్వహించే విమానాశ్రయం కావడంతో ఈ రంగంలో అనుభవం ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

'జగనన్న సురక్ష' గొప్ప కార్యక్రమం



ఈయన పేరు రెడ్డిచెర్ల బాలకృష్ణారెడ్డి. ఈయనది పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామం. వలంటీర్, సచివాలయ ఉద్యోగి బాలకృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనకు కావాల్సిన సర్టిఫికెట్ల వివరాలు తెలుసుకున్నారు. నివాసం, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు అవసరమని నమోదు చేసుకున్నారు. ఆ గ్రామ సచివాలయంలో నిర్వహించిన క్యాంపులో బాలకృష్ణారెడ్డి అడిగిన సర్టిఫికెట్లు అందజేశారు. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ 'జగనన్న సురక్ష' కార్యక్రమం చాలా గొప్పగా ఉందని పేర్కొన్నారు.

ప్రదక్షిణలు తప్పాయ్



ఈమె పేరు చెన్నుపల్లి అచ్చెమ్మ. పొదలకూరు మండలం మొగళ్లూరు ఎస్సీకాలనీ నివాసి. 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో నివాసం, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు కావాలని కోరగానే అధికారులు అందజేశారు. దీంతో గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం అడిగిన వెంటనే సర్టిఫికెట్లు పొందగలుగుతున్నామని అచ్చమ్మ తెలిపారు. పేదలకు ఇంతకంటే కావాల్సింది ఏముంటుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

పొదలకూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. మండలంలోని మొగళ్లూరు సచివాలయంలో శనివారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంపును ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజుతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సురక్ష క్యాంపులో పాల్గొని గ్రామస్తుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూశాఖకు సంబంధించిన వినతిపత్రాలే అధిక సంఖ్యలో అందడంతో కలెక్టర్ రికార్డులను పరిశీలించి సమగ్రమైన వివరాలు తెలుసుకుని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు దూరమైన వారిని గుర్తించి పూర్తిస్థాయిలో పథకాలను అమలు చేసేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదట గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అవసరమైన సర్టిఫికెట్ల వివరాలను అడిగి తెలుసుకుని సచివాలయాల్లో నిర్వహించే సురక్ష క్యాంపులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. మొగళ్లూరు సచివాలయ పరిధిలో 350కి పైగా సర్వీసులను అందించినట్లు తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుసంధానంగా 'జగనన్న సురక్ష'ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఎల్‌డీఓ వసుమతి, తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్ విజయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మొగళ్లూరులో 'జగనన్న సురక్ష' క్యాంపులో రికార్డులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ముత్యాలరాజు, కలెక్టర్ హరినారాయణన్

సచివాలయ ఉద్యోగులతో మాటామంతీ

మొగళ్లూరు సచివాలయ ఉద్యోగులతో ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి, పూర్వపు నెల్లూరు జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు మాట్లాడారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందించే సేవల వివరాలను ఉద్యోగుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని తెలిపారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



రైతులకు పంటల బీమా నమూనా చెక్కు అందజేస్తున్న దృశ్యం

- రైతు దినోత్సవ వేడుకల్లో మేకపాటి రాజారెడ్డి

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయగిరిలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. విలువలు, విశ్వసనీయతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుపేరన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను 98 శాతం అమలు చేశారని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకుసాగాలంటే 2024లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. రైతుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు అమలు చేసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నదాతల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేశారు. అనంతరం పంటల బీమా పథకానికి సంబంధించి 127 మంది రైతులకు రూ.79.80 లక్షల చెక్కులను అందజేశారు. రూ.79 లక్షలతో మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మించిన నూతన అగ్రిటెస్ట్ ల్యాబ్‌ను జేసీ కూర్మనాథ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు, పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జెడ్పీటీసీ సభ్యులు పాలూరి మాల్యాద్రిరెడ్డి, రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకరత్నం, కె.రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ సుబ్బారెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రలో అపశ్రుతి



కాలువలో పడిన మహిళలను పైకి లాగుతున్న దృశ్యం



పాదయాత్ర కోసం సింగపేట గ్రామవాసులను ప్రమాదకరంగా ట్రాక్టర్‌లో ఇస్కపల్లికి తరలిస్తున్న దృశ్యం

- కాలువలో పడిన మహిళలు

కావలి/అల్లూరు: అల్లూరు నుంచి శనివారం ఉదయం 9.30 గంటలకు టీడీపీ నేత నారా లోకేశ్ యువగళం 150వ రోజు పాదయాత్ర ప్రారంభమైన కొద్దిసేపటికే అపశ్రుతి చోటుచేసుకుంది. ఇప్పటి వరకు సాయంత్రం మాత్రమే పాదయాత్ర చేస్తున్న లోకేశ్.. శనివారం నుంచి ఉదయం పూట కూడా చేయాలని నిశ్చయించుకుని ప్రారంభించారు. మధ్యాహ్న భోజన సమయానికి అల్లూరు మండలం ఇస్కపల్లి గ్రామం వరకు చేరుకొనేలా పాదయాత్రను మొదలుపెట్టారు. యాత్ర ప్రారంభమైన కాసేపటికే ఇస్కపల్లి తూము కాలువ వద్ద తోపులాట జరిగి ఆరుగురు మహిళలు కాలువలో పడిపోయారు. అయితే పక్కనే ఉన్న వారు వెంటనే కాలువలో పడిన మహిళలను బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది. లోకేశ్ పాదయాత్ర చేస్తున్న అల్లూరు మండలం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సొంత మండలం కావడం, పాదయాత్ర నేరుగా రవిచంద్ర స్వగ్రామమైన ఇస్కపల్లికి వెళ్తుండడంతో మండలంలోని ఇతర గ్రామాల నుంచి జనాలను ట్రాక్టర్లు, ఆటోల్లో తరలించారు.

చీటీల పేరుతో రూ.4 కోట్లకు పైగా మోసం

నాయుడుపేటటౌన్: ఓ జంట మరికొందరు మహిళలతో కలిసి మండల పరిధిలోని గొట్టిప్రోలు, సమీప గ్రామాలకు చెందిన పలువురు మహిళల వద్ద అధిక వడ్డీ ఇస్తామని చెప్పి ఆశ చూపి సుమారు రూ.4 కోట్లకు పైగా చీటీల నగదు తీసుకుని మోసం చేశారని బాధితులు శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొట్టిప్రోలు గ్రామానికి చెందిన లింగారెడ్డి రాజారెడ్డి, అతని భార్య సుప్రియ మరికొంతమంది విద్యానగర్ ప్రాంతానికి చెందిన మహిళలు కలసి నెలానెలా చీటీ వేస్తున్నారు. మండల పరిధిలోని గొట్టిపల్లి, రాచర్ల వడ్డికండ్రిగ, అగచాట్లపురం తదితర గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా మహిళలు, గ్రామస్తులు వారి వద్ద చీటీలు వేశారు. చీటీలు పాడుకున్న వారిని అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికిచి వారి వద్ద నుంచి నగదును తీసుకునేవారు. మొదట్లో నెలనెలా వడ్డీ నగదు చెల్లించేవారు. వడ్డీ అధికంగా వస్తుందన్న ఆశతో అనేక మంది ఒకరికి తెలియకుండా ఒకరు వారికి నగదు వడ్డీలకు ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం రాజారెడ్డి కుటుంబసభ్యులు గ్రామం నుంచి వెళ్లిపోయారు. వారికి నగదు ఇచ్చిన వారు లబోదిబోమంటూ వారి కోసం వెతుకులాట మొదలుపెట్టారు. వారితో కలిసి చీటీలు నిర్వహించే కొంతమంది మహిళలు విద్యానగర్‌లో ఉండడంతో వారిని కలిసి తమ వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని కోరారు. అయితే వారు సరైన సమాధానం చెప్పడం లేదని బాధితులు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ నరసింహరావులను కలిసి ఫిర్యాదు చేశారు. సీఐ బాధితులను విచారించి వివరాలు తెలుసుకుంటున్నారు. పరారీలో ఉన్న వారి కోసం ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

కాలువలో ఈతకు వెళ్లి యువకుడి మృతి

కొడవలూరు: కాలువలో ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో మరుసటి రోజున మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన కొడవలూరు మండలంలోని కొత్తవంగల్లు సమీపంలో ఉన్న తూర్పుకాలువలో చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. కొత్తవంగల్లు మజరా చీకిరేణిగుంట గిరిజనకాలనీకి చెందిన జానా పవన్(20) వరికోత యంత్రం ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వరికోతలు లేకపోవడంతో ఖాళీగా ఉన్నాడు. శుక్రవారం తాను తూర్పుకాలువలో ఈతకు వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. పవన్ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఎస్సై జి.సుబ్బారావు సిబ్బందితో తూర్పుకాలువ వద్దకు చేరుకొని స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొత్తవంగల్లు సమీపంలోని లాకల(ఏడు శూలాల) వద్ద పవన్ మృతదేహాన్ని గుర్తించారు. పవన్‌కు ఈత వచ్చినప్పటికీ కాలువలో నాచు ఎక్కువగా ఉండడం, మద్యం తాగడం వల్ల మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పవన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుబ్బారావు

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 170

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

మెట్టప్రాంతానికి వరం వ్యవసాయ కళాశాల

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరిలో ఏర్పాటు చేసిన మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల మెట్టప్రాంత రైతుబిడ్డలకు వరమని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో శనివారం మెరిట్స్‌లో పనిచేసిన 25 మంది అధ్యాపకులు, సహాయక సిబ్బందికి ఒప్పంద, తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. రూ.250 కోట్ల విలువ గల ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చి గౌతమ్‌రెడ్డి పేరుతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు. రాబోయే రెండు మూడేళ్లలో ఈ కళాశాలను వ్యవసాయ యూనివర్సిటీగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. తద్వారా గౌతమ్‌రెడ్డి ఆశయం నెరవేర్చినట్లవుతుందన్నారు. గతంలో మెరిట్స్ కళాశాలలో పనిచేసిన అధ్యాపక, సహాయ సిబ్బందికి వ్యవసాయ కళాశాలలో ఉద్యోగాలు ఇవ్వడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కరుణసాగర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు కళాశాలలో రైతు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

పెళ్లకూరు: ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చిల్లకూరులో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి పెద్ద కుమారుడు వినోద్‌కుమార్‌రెడ్డి(27) వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలో చెరువుకట్ట సమీపంలో పొలం గట్టు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ నుంచి కింద పడ్డాడు. చక్రాలు వినోద్‌కుమార్‌రెడ్డి మీదుగా వెళ్లాయి. ఈ ఘటనలో వినోద్‌కుమార్‌రెడ్డి తీవ్రగాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి స్థానికులతో కలిసి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి భార్య సావిత్రి, కుమార్తె పావనిసిరి, కుమారుడు ధర్మతేజరెడ్డి ఉన్నారు. వినోద్‌కుమార్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.